క్లుప్తంగా

ధ్వజ స్తంభం నిర్మాణానికి విరాళం



విరాళం ఇస్తున్న బుసినె విరుపాక్షి

చిప్పగిరి: హాలహర్వి మండలం బాపురం గ్రామంలోని శ్రీరామ మందిరం ధ్వజ స్తంభం నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరుపాక్షి రూ.20,000 విరాళమిచ్చారు. సోమవారం గ్రామ పెద్దలకు విరాళం అందించారు.

నేటి నుంచి దస్తగిరి స్వామి ఉరుసు

ఆస్పరి: మండలంలోని పుప్పాలదొడ్డి గ్రామంలో మంగళవారం నుంచి దస్తగిరి స్వామి, యంకప్ప తాత ఉరుసు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సోమవారం గ్రామ పెద్దలు తెలిపారు. దర్గాలో మంగళవారం గంధం, బుధవారం ఉరుసు, గురువారం జియారత్‌తో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

కృష్ణగిరి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నియోజకవర్గ వ్యాప్తంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచామని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన సీఐ సురేష్‌కుమార్‌రెడ్డితో కలిసి పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.ముందు జాగ్రత్తగా సమస్యాత్మక గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లో బైండోవర్ కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏఎస్‌ఐ ఆదికేశవరాజును వారు ఆదేశించారు.

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

కృష్ణగిరి: స్పందనలో వచ్చే అర్జీల పట్ల నిర్లక్ష్యం వహించకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ అనురాధ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆమె స్పందన నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేశారు. సాయంత్రం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో ప్రజలతో మమేకమై క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వస్తున్న ఫారం–6లను పరిశీలించాలన్నారు.

నేడు శివస్వాముల జ్యోతిర్లింగాల మహా పూజ

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన అన్నపూర్ణ సమేత భీమ లింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవా రం సామూహిక శివస్వాముల జ్యోతిర్లింగాల మహా పూజ చేపడుతున్నట్లు ఆలయ అధ్యక్షు లు లక్ష్మిరెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 8:30 గంటలకు మహాగణపతి, గౌరి పూజతో ప్రారంభమవుతుందన్నారు.పదిన్నరకు ప్రధా న కలశ ఆవాహనం, జ్యోతిర్లింగాల ఆవాహనం, రుద్రాభిషేకం చేపట్టి అనంతరం మహాదేవునికి స్వరాభిషేకం, అష్టోత్తర పూజ నిర్వహిస్తామన్నారు.

మాఘమాస, శివరాత్రి విశిష్టతలపై ఇంటింటి ప్రచారం

మద్దికెర: మాఘమాసంలోని పౌర్ణమి, శివరాత్రి విశిష్టతల గురించి ఇంటింటి ప్రచారం నిర్వహించడమే గాకుండా భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు త్రైతసిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూజ్ఞాన వేదిక గుత్తి కమిటీ అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రచారంతోపాటు భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. మాఘమాసం శుక్ల చతుర్దశి రోజు శివ రాత్రి నిర్ణయించారని, పూర్వం నిరాకార పరమాత్మను ఈశ్వరలింగంగా చూపించారని చెప్పారు. మాఘపూర్ణిమ భగవంతుని జన్మ తెలియజేస్తుందని, సాకార భగవంతుడికి గర్భగుడి ఉంటుందని ఆలయాలు సుగుణోపాసన, నిర్గుణోపాసన వ్యత్యాసాలను తెలియజేస్తున్నాయన్నారు. సుగుణ, నిర్గుణ పూజలను తెలుసుకోవడం వల్ల ధర్మములేవో, అధర్మములేవో తెలుసుకోగలిగే విచక్షణకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు బ్రహ్మ, శ్రీనివాసులు, రాజారావు, శివాజీరావు పాల్గొన్నారు.

మాలలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి

ఆలూరు: అన్ని పార్టీలు మాలలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని మాల మహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు మహానంది కోరారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో సోమవారం వివిధ గ్రామాలకు చెందిన మాల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మహానంది మాట్లాడుతూ వచ్చే సాధారణ ఎన్నికల్లో మాలలకు ఎమ్మెల్యే సీట్లు ఇచ్చే పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. సమావేశంలో మాల సంఘం నాయకులు భరత్, వెంకటరాముడు, గాదిలింగప్ప, బసవరాజ్, లక్ష్మన్న, గోవిందు, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో శభాష్‌పురం పంచాయతీ

- రూ.82.60లక్షలతో ప్రభుత్వ భవన నిర్మాణాలు
- రూ.4.75కోట్లతో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణాలు
- పీసీ కొండ, జీజీ రాళ్లలో ఇంటింటికీ కుళాయిలు
- డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా ఖర్చు చేసిన మొత్తం రూ.22.80 కోట్లు

శభాష్‌పురం పంచాయతీ.. తుగ్గలి మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. పంచాయతీ పరిధిలో పైచింతలకొండ, దిగువచింతల కొండ, గుడిసెగుప్పరాళ్ల మజారా గ్రామాలు. 667 కుటుంబాలు, 3,081 మంది జనాభా ఉన్నారు. టీడీపీ హయాంలో ఈ పల్లెల వైపు కన్నెత్తి చూసిన నాథుడే లేరు. జగనన్న ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ భవనలు, సీసీ రోడ్లు, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఇలా మౌలికసదుపాయలన్నీ కల్పించారు. టీడీపీ హయాంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పంచాయతీ ఇప్పుడు పేరుకు తగ్గట్టుకుగా 'శభాష్'పురం అనిపించుకుంటోంది.







రూ.40 లక్షలతో శభాష్‌పురంలో నిర్మించిన సచివాలయ భవనం, రూ.42.60 లక్షలతో శభాష్‌పురంలో నిర్మించిన ఆర్‌బీకే, హెల్త్ సెంటర్

తుగ్గలి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక పంచాయతీ అభివృద్ధి బాట పట్టింది. శభాష్‌పురంలో ప్రభుత్వ సేవలందించే రూ.40 లక్షలతో సచివాలయం నిర్మితమైంది. రైతులకు విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు సేవలందించేందుకు రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం అందుబాటులోకి తెచ్చింది. ప్రజలకు ఆరోగ్య భాగ్యం కల్పించేందుకు రూ.20.80 లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటైంది. ఎమ్మెల్యే, ఎస్సీ సబ్‌ప్లాన్, ఎంఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులు రూ.35 లక్షలతో ఎస్సీ కాలనీ, బీసీ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు.

➡ మజారా గ్రామం పై చింతలకొండకు శభాష్‌పురం నుంచి 3.9 కిలోమీటర్ల మేర రూ.3.71 కోట్లతో తారురోడ్డు సదుపాయం కల్పించారు. జలజీవన్ మిషన్ కింద రూ.35 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య తీర్చారు. రూ.16 లక్షలతో సీసీ రోడ్లు వేశారు.

➡ దిగువచింతలకొండలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.34 లక్షలు, మండల గ్రాంటు, ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ రూ.15లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు.

➡ గుడిసెగుప్పరాళ్లలో సర్పంచ్ నిధులు రూ.14 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు.

➡ పంచాయతీ పరిధిలో వైఎస్సార్ జలకళ పథకం కింద 104 బోర్లు తవ్వారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు..

➡ శభాష్‌పురం పంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాల్లో 667 కుటుంబాల్లో 3,081 మంది జనాభా నివసిస్తున్నారు. వీరిలో అర్హుల ఖాతాలకు వివిధ సంక్షేమ పథకాల కింద నాలుగున్నరేళ్లలో డీబీటీ కింద రూ.17.33 కోట్లు జమ చేయగా, నాన్ డీబీటీ కింద రూ.5.47 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. రైతు భరోసా కింద 918 మంది రైతులకు రూ.4.60 కోట్లు, ఉచిత పంటల బీమా 1,029 మంది రైతులకు రూ.2.37 కోట్లు, సున్నా వడ్డీ 771 మందికి రూ.32.09 కోట్లు, పెన్షన్ కానుక 419 మందికి రూ.4.12 కోట్లు, వైఎస్సార్ చేయూత 259 మందికి రూ.1.05కోట్లు, ఆసరా కింద 290 మందికి రూ.56.90 లక్షలు, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ, ఆరోగ్య ఆసరా 281 మందికి రూ.56.20 లక్షలు, వాహన మిత్ర, జగనన్న విద్యా దీవెన, చేదోడు వంటి పథకాల కింద 144 మందికి రూ.26.05 లక్షల నిధులు లబ్ధిదారుల ఖాతాలకు జమ అయ్యాయి. ఇవే కాకుండా నాడు–నేడు కింద రూ.22 లక్షలతో శభాష్‌పురం యూపీ స్కూల్‌ను తీర్చిదిద్దారు. రూ.19 లక్షలతో పీసీ కొండ యూపీ స్కూల్, రూ.22 లక్షలతో జీజీ రాళ్ల పాఠశాలలను ఆధునీకరిస్తున్నారు.



రూ.3.71కోట్లతో వేసిన పీసీకొండ తారురోడ్డు



డీసీకొండలో రూ.34 లక్షలతో వేసిన సీసీరోడ్డు

రోడ్డు, నీటి కష్టాలు తప్పాయి



ఏళ్ల తరబడి నెలకొన్న రోడ్డు, తాగునీటి సమస్య తీరింది. గతంలో తాగునీటి కోసం రెండు, మూడు కిలోమీటర్ల దూరంలోని తోటలకు వెళ్లి తెచ్చుకునే వాళ్లం. ఊరికి రోడ్డు కూడా లేక ఎన్నో అవస్థలు పడ్డాం. ఎంతోమందికి మొర పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఊరికి తారు రోడ్డు వేశారు. ఇంటింటికీ కుళాయిలు వేసి నీళ్లు అందిస్తున్నారు. ఏళ్ల కలలు నెరవేరినందుకు సంతోషంగా ఉంది.

– ఇంద్రాంపల్లి లక్ష్మి, పైచింతలకొండ

నాలుగున్నరేళ్లల్లో ఎంతో అభివృద్ధి



నాలుగున్నరేళ్ల జగనన్న పాలనలో పంచాయతీ రూపురేఖలు మారిపోయాయి. ఏళ్ల తరబడి రోడ్డు లేక, తాగునీటి సమస్యతో పీసీకొండ గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శభాష్‌పురంలో సచివాలయం, ఆర్‌బీకే ,హెల్త్ క్లినిక్ ఏర్పాటయ్యాయి. ఎమ్మెల్యే శ్రీదేవి సహకారంతో పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. నేను సర్పంచ్‌గా ఉన్న సమయంలో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమైనందుకు సంతోషంగా ఉంది.

– గూటిపల్లి పుష్పావతి, శభాష్‌పురం

ఎమ్మెల్యే శ్రీదేవికి కృతజ్ఞతలు



గతంలో ఎన్నడూ లేనవిధంగా ఈ నాలుగున్నరేళ్లలో పంచాయతీలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయి. కొందరు అభివృద్ధికి అడ్డు పడుతున్నా ఎమ్మెల్యే శ్రీదేవి సహకారంతో వాటన్నింటినీ అధిగమించి పంచాయతీ అభివృద్ధికి పాటుపడుతున్నాం. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో వ్యయప్రయాసాలు లేకుండా ప్రజల సమస్యలన్నీ సచివాలయంలోనే పరిష్కారమవుతున్నాయి. అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

– రాచపాటి రామాంజనమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు, శభాష్‌పురం

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లెలో పామయ్యతాత తిరునాల సందర్భంగా సోమవారం నిర్వహించిన ఒంగోలు జాతి ఎడ్ల రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీలలలో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచెనపల్లి పీఆర్ మెమోరియల్ వృషభాలు విజేతలుగా నిలిచి ప్రథమ బహుమతి రూ.50 వేలు గెలుచుకున్నాయి. తర్వాతి నాలుగు స్థానాలలో వరుసగా అనంతపురం జిల్లా నారాయణపురం నజీర్‌బాషా వృషభాలు, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పీఆర్ పల్లె మంగలి నాగయ్య వృషభాలు, బాపట్ల జిల్లా బల్లికురువ గ్రామ వీరస్వామి వృషభాలు, కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పందికోన గ్రామ ఉప్పరి సుందరప్ప వృషభాలు నిలిచి రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు గెలుచుకున్నాయి. వెల్దుర్తి వ్యవసాయ ప్రాథమిక సహకార సొసైటీ చైర్మన్ కంగాటి వంశీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సమీర్ కుమార్ రెడ్డి, దాతలు హాజరై విజేత వృషభ యజమానులకు నగదు బహుమతు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వెల్దుర్తి మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సమీర్‌కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న మాదిగ, బొమ్మిరెడ్డిపల్లె సర్పంచ్ సునీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని బుక్కాపురం, కలుగొట్ల, పుల్లగుమ్మి, కృష్ణాపురం గ్రామాల పాఠశాలల్లోని పోలింగ్ స్టేషన్లను, సౌకర్యాలను సోమవారం తహసీల్దార్ అనంతాచారి, ఎంపీడీఓ శివశంకరప్ప పరిశీలించారు. బీఎల్‌ఓలు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, వీఆర్‌ఓలతో వివరాలు సేకరించారు.

☛ మద్దికెర: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం తహసీల్దార్ రజాక్‌వలి రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. 34 కేంద్రాలు ఉన్నాయని, ప్రతి కేంద్రంలో అన్ని రకాల వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంట ఆర్‌ఐ రవికుమార్, వీఆర్వోలు రంగస్వామి, హర్షవర్ధన్ ఉన్నారు.

☛ దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో పోలింగ్ కేంద్రాలను సోమవారం సీఐ శ్రీనివాసులు పరిశీలించారు. ప్రజలతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని, ఎవరికీ భయపడాల్సిన పని లేదని భరోసా ఇచ్చారు. ఏవైనా సమస్యలు ఉంటే తనదృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం గ్రామంలోని ఏపీజీబీ బ్యాంకులో ఖాతాదారులతో సమావేశమై మాట్లాడారు. ఆన్‌లైన్ మోసపూరిత లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

తుగ్గలి: కరువుబారిన పడిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు సంఘం నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కొండారెడ్డి, రంగరాజు కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. వర్షాభావంతో పంటలన్నీ కోల్పోయినా కరువు మండలంగా ప్రకటించక పోవడం బాధాకరమన్నారు.

➡ ఆలూరు: రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరుతూ ఏపీ రైతు సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు ఈరన్న, గౌడు, సీనియర్ నాయకులు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, షాకీర్ తదితరులు మాట్లాడారు. సరైన వర్షాలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంటల బీమా పథకాన్ని అమలు చేసి రైతులకు ఆదుకోవాలని కోరారు.

➡ హొళగుంద: పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని ఏఐకేఎస్, సీఐటీయూ మండల కార్యదర్శులు వెంకటేష్, నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం వారు తహసీల్దారు ప్రసాద్‌రాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, పంపన్న, ఈరన్న, బసవరాజు పాల్గొన్నారు.

➡ ఎమ్మిగనూరు టౌన్: పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేసి ఆదుకోవాలని రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతిపత్రాన్ని తహసీల్దార్ శేషారెడ్డికి అందించారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేద్దాం

- పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక



సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక సూచించారు. ఈనెల 18న అనంతపురం జిల్లా రాప్తాడు ఆటోనగర్‌లో నిర్వహించనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'సిద్ధం' సభను విజయవంతం చేసేందుకు సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం లో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో అన్ని గ్రామాల నుంచి సిద్ధం సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులే జగనన్నకు క్యాంపెయనర్లుగా నిలవనున్నారన్నారు. సంక్షేమ పాలన కొనసాగిస్తున్న సీఎం జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకునేందుకు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను మరోసాఇ ఎగురవేయాలన్నారు. ప్రజలకు, పార్టీ శ్రేణులకు తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు తనవంతుగా కృషి చేస్తానని చెప్పారు. అనంతరం సిద్ధం సభ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వక్ఫ్‌బోర్డ్ జిల్లా ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యుకె రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం



మంటలను ఆర్పుతున్న దృశ్యం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి శ్రీరంగనాథ స్వామి ఆలయానికి సంబంధించిన 5 ట్రాక్టర్ల పశుగ్రాసం సోమవారం సాయంత్రం మంటలకు దగ్ధమైంది. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఆలయం నిర్వహిస్తున్న గోశాలలోని గోవుల కోసం ఉంచిన 3 ట్రాక్టర్ల తెల్ల సొప్ప, 2 ట్రాక్టర్లు వరిగడ్డికి మంటలు వ్యాపించి దగ్ధమైంది. దాదాపు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని ఈఓ వివరించారు.

జగనన్న చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి



కార్యకర్తలతో మాట్లాడుతున్న విరుపాక్షి

హొళగుంద: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి సూచించారు. సోమవారం ఆయన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో కొత్త రూపు తెచ్చుకున్న ప్రభుత్వ పాఠశాలలు, వలంటీర్లు ఇంటింటికెళ్లి ఇస్తున్న పింఛన్లు, ఆస్పత్రుల్లో ఇద్దరు చొప్పున డాక్టర్లు, ప్రతి ఊరికి సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, అమ్మ ఒడి, ఆసరా, చేయూత తదితర పథకాలు తీసుకున్న లబ్ధిదారులను కలిసి మరోసారి గుర్తు చేయాలన్నారు. పథకాలన్నీ కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరముందని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

దేవనకొండ: కార్మికుల, రైతుల, వ్యవసాయ కూలీల హక్కుల సాధనకు ఈనెల 16న చేపట్టే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎం.నరసారావు కోరారు. సోమవారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు

మద్దికెర: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పొలాల్లో మద్యం తాగి సీసాలు పడేస్తుండటంతో కాళ్లకు గుచ్చుకుంటున్నాయని రైతులు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. నిఘా ఉంచి ఎవరైనాన బయట ప్రాంతాల్లో మందు తాగుతున్నట్లు కనిపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పారిశుధ్య పనులు



డ్రైనేజీలో పూడిక తొలగిస్తున్న దృశ్యం

హొళగుంద: పెద్దగోనెహాళ్ గ్రామంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కొత్తింటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీలు నిండిపోయి మురుగు నీరు నిలిచిపోవడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.విషయం తెలుసుకున్న వెంకటరెడ్డి కూలీలు, జేసీబీతో ప్రధాన కాలనీలోని డ్రైనేజీలలో చెత్తచెదారాన్ని తొలగించారు. మురుగునీరు, పూడికను తొలగించి దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

కురువలకు న్యాయం చేయాలి

హొళగుంద: త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికల్లో కురువలకు సీట్లు కేటాయించాలని మాదాసి కురువ, మాదారి కురువ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లార్తి దర్గన్న, జిల్లా కార్యదర్శి గర్జప్ప, నాయకులు రంగస్వామి, బీరప్ప, చంద్ర తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం వారు హొళగుంద సాయిబన్న దర్గా ఆవరణంలో విలేకరులతో మాట్లాడారు. రాజకీయ పార్టీ నాయకులు కురువలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే తప్పా మేలు చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో అధిక సంఖ్యలో కురువలున్నారని, అయితే అనేక రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కురువ సంఘం నాయకులు మఠం మహేశ్, మారెప్ప, నల్లారెడ్డి, వెంకోబ, తిక్కన్న, నాగరాజు, భీమేష్, శేషప్ప, గాదిలింగప్ప, మల్లప్ప పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న బుట్టా రేణుక



పూజలందుకుంటున్న నీలకంఠేశ్వర స్వామి

గోనెగండ్ల: వీవర్స్ కాలనీలో వెలసిన నీలకంఠేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం కుర్ణి దైవాచార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అర్చకులు రామారావు గణపతిపూజ, నవగ్రహపూజ, స్వామి వారి నిర్మలాభిషేకం,పంచామృతాభిషేకం, అలంకరణ పూజ కార్యక్రమాలతో పాటు శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు.గౌరీవ్రతం అనంతరం పల్లకీ ఉత్సవాన్ని ఊరేగించారు. భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

బుట్టా రేణుక పూజలు..

నీలకంఠేశ్వర స్వామిని బుట్టా రేణుక దర్శించుకున్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆమె భర్త నీలకంఠతో కలిసి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివ పార్వతుల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.



పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఆమె తనయుడు రామ్మోహన్‌రెడ్డి సోమవారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి పనులపై సీఎంతో చర్చించారు. – పత్తికొండ టౌన్